కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- విష ప్రచారం చేసేవారిని ఉపేక్షించొద్దు
- మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీల ఏర్పాటు
- వ్యవసాయ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్లతో సిఎం వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో ఎన్నడూ లేని విధంగా రుతుపవనాలు 15 రోజులు ముందుగా వచ్చాయని, దానికి అనుగుణంగా సన్నద్ధమై ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. వానలు ముందుగా రావడం వల్ల కొన్ని చోట్ల ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తాయని, రైతులు ఆందోళన చెందారని ముఖ్యమంత్రి అన్నారు. మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌లతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'యాసంగిలో గతంలో ఎన్నడూ లేనంత ధాన్యాన్ని ప్రభుత్వం ఈసారి కొనుగోలు చేసింది. గత ఏడాది 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటే, ఈసారి ఇప్పటికే 64.50 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లు జరిగింది, ఇప్పటికే 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 48 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించామని, ఈ సీజన్లో ఇప్పటికే రూ.12184 కోట్లు చెల్లించామన్నారు. అధికారులు, జిల్లాల్లో కలెక్టర్లు సమర్థంగా పని చేయటం వల్లనే ప్రభుత్వం ఈ విజయం సాధించిందని అభినందించారు.

ఈ ఏడాది ముందుగా వచ్చిన వర్షాలతో ధాన్యం సేకరణకు అక్కడక్కడ ఆటంకం కలిగిందని అభిప్రాయ పడ్డారు. గత ఏడాదితో పోలిస్తే 21.50 లక్షల టన్నుల ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని, మరో నాలుగైదు లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద మిగిలి ఉందని, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు. 33 జిల్లాల్లో 21 జిల్లాల్లో ధాన్యం సేకరణ విజయవంతంగా సాగిందని, 12 జిల్లాల్లో అక్కడక్కడ ఆందోళనలు జరిగినట్లు దృష్టికి వచ్చిందన్నారు. కలెక్టర్లు



క్షేత్రస్థాయికి వెళితే ఈ సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించవచ్చునని తెలిపారు. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత ఆందోళనలు జరుగుతున్నాయని అన్నారు. అందుకే కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను దాచిపెట్టకుండా వెల్లడించాలని, కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాలనా పరంగా తప్పులు జరిగితే, వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలని, తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వాలని అన్నారు. ఉద్దేశపూర్వకంగా విష ప్రచారం చేసే వారిపై కేసులు పెట్టేందుకు వెనుకాడ వద్దని స్పష్టంచేశారు. అన్ని జిల్లాల్లో విత్తనాలు, ఎరువులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, బఫర్ స్టాక్ ఉందా లేదా చూసుకోవాలని, కలెక్టర్లు ఏ రోజుకారోజు సమీక్షించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను బ్లాక్ మార్కెట్ చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, కల్తీ విత్తనాలను అరికట్టేందుకు వీలుగా జిల్లాలో పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించుకోవాలని సూచించారు. భూ భారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలని, రైతుల సమస్యలకు పరిష్కారాలను సూచించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు రాష్ట్రమంతటా మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని దిశానిర్దేశం చేశారు. నిరుపేదలు ఇల్లు కట్టుకుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, కలెక్టర్లు తమ పనితీరును బాధ్యతగా నిర్వర్తించి ఈ పథకాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల తుది జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీల ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్, ఎంపిడిఒ, కార్మిక శాఖ అధికారి, స్వయం సహాయక సంఘం సభ్యులతో ఈ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేస్త్రీల ఛార్జీలు, స్టోన్ మెటల్ వంటి ధరలను కట్టడి చేసే బాధ్యతను ఈ కమిటీ చేపడుతుందన్నారు. ఇసుక దందాతో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉచిత ఇసుక కూపన్లను సకాలంలో అందించాలని, లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్ల తయారీకి ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు. నిరుపేద లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా తక్కువ ఖర్చుతో ఇండ్ల నిర్మాణం జరిగే కొత్త సాంకేతికతను అనుసరించాలని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి సూచించారు. ధాన్యం సేకరణ, భూ భారతి రెవెన్యూ సదస్సులు, వానాకాలం పంటల సాగు సన్నద్ధ ప్రణాళికలపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలని చెప్పారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. జూన్ 1 నాటికి జిల్లాల వారీగా ఈ అంశాలన్నింటిపై పూర్తి నివేదికను తనకు అందించాలని మంత్రులు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. అదే రోజున సెక్రటేరియట్లో మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమై వెంటనే తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై చర్చిస్తామని సిఎం రేవంత్ తెలిపారు.

పోరాటం కొనసాగిస్తాం

- హెచ్‌కె ఆస్పత్రి తప్పులు సరిదిద్దుకోవాల్సిందే : పూర్ణిమ మండవ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెచ్‌కె ఆస్పత్రి తప్పులను ఒప్పుకుని సరిదిద్దుకునేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని అంతర్జాతీయ క్రీడాకారిణి, వెల్‌నెస్ ఆఫ్ ఉమెన్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ పూర్ణిమ మండవ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న నకిలీ, అర్హత లేని డాక్టర్లు, అలాంటి వారితో నడుస్తున్న క్లినిక్‌లు, ఆస్పత్రులను తాము ఎండగడుతున్నామని తెలిపారు. ఆ క్రమంలో హెచ్‌కె క్లినిక్‌కు సంబంధించిన సమాచారంతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నించినట్టు చెప్పారు. అయితే సోమవారం హెచ్‌కె ఆస్పత్రి నిర్వాహకులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించి డిజిపికి ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానంలో తమపై పరువు నష్టం దావా వేయనున్నట్టు హెచ్చరించారని తెలిపారు. అలాంటి బెదిరింపులకు అదిరేది, బెదిరేది లేదని పూర్ణిమ స్పష్టం చేశారు. తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. న్యాయవాది హనుమంతరావు మాట్లాడుతూ అర్హత లేని వైద్యుల చికిత్సలతో పలు సందర్భాల్లో దుష్ప్రభావాలతో పాటు కొన్ని సార్లు మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాక్స్ ఎక్స్‌పర్ట్, హెచ్‌కె ఆస్పత్రి పూర్వ క్లయింట్ దుర్గాంజలి మాట్లాడుతూ. హెచ్‌కె ఆస్పత్రి జిఎస్‌టి ఎగవేస్తున్నట్టు ఆరోపించారు. ఈ సమావేశంలో వెల్‌నెస్ ఆఫ్ ఉమెన్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ మృతి

- ముఖ్యమంత్రి, మంత్రులు సంతాపం
- నేడు స్వగ్రామం రఘునాధపాలెం మండలం ఈర్లపూడిలో అంత్యక్రియలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ నెల 23వ తేదీన కడుపు నొప్పి రావడంతో హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో చేరారు. అన్నవాహిక ఇన్ఫెక్షన్‌తో నాలుగు రోజులుగా ఆస్పత్రిలోనే ఆయన చికిత్స పొందుతున్నారు. సోమవారం ఆయన్ను పరీక్షించిన వైద్యులు ఒకటి, రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. అయితే అకస్మాత్తుగా మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆస్పత్రిలోనే ఆయన మృతి చెందారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వైరా నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా పని చేసిన మదన్‌లాల్.. నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారు. నియోజకవర్గంలో తన అనుచరులకు అండగా ఉంటూ వారి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి ప్రయత్నించేవారు.

సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ దిగ్భ్రాంతి...

వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపిలు, బిఆర్ఎస్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నేడు అంత్యక్రియలు

మదన్‌లాల్ స్వగ్రామం ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. భౌతికకాయాన్ని ఆస్పత్రిలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. బుధవారం నిర్వహించే అంత్యక్రియలకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని బిఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి.

ఎమర్జెన్సీ సేవల్లో విప్లవాత్మక మార్పులు

- ప్రారంభించిన కేర్ హాస్పిటల్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ ఆరోగ్య సంస్థ అయిన కేర్ హాస్పిటల్స్ తాజాగా "ది పవర్ ఆఫ్ త్రీ" పేరుతో దేశవ్యాప్తంగా నూతన ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ ప్రచారం ద్వారా వేగవంతమైన స్పందన, నిపుణులచే చికిత్స, సానుభూతితో కూడిన సేవలు, అత్యవసర వైద్య సేవల్లో దేశవ్యాప్తంగా కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా కేర్ హాస్పిటల్స్ హైదరాబాద్ లోని అన్ని ఆసుపత్రులలో 5జి అంబులెన్సులు ప్రారంభించింది. బాధితుడి పరిస్థితిని అంబులెన్స్‌లోనే ఆసుపత్రికి వెంటనే తెలియజేస్తారు. లైవ్ ట్రాకింగ్ సహాయంతో ఆసుపత్రి ఎమర్జెన్సీ డాక్టర్లు త్వరగా స్పందించగలుగుతారు. హైదరాబాద్‌లో ఎక్కడైనా 30 నిమిషాల్లోనే అంబులెన్స్ తమ దగ్గరలోని కేర్ హాస్పిటల్‌కు బాధితులను తీసుకెళ్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ ఎండి వరుణ్ ఖన్నా, గ్రూప్ సిఎఫ్ఒ విశాల్ మహేశ్వరి ఇతర సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ జరపాలి

- ఎన్‌కౌంటర్‌లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్‌పై న్యాయ విచారణ జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలో జరుగుతున్న సిపిఐ జిల్లా మహాసభల రెండవరోజైన మంగళవారం కూనంనేని పాల్గొని మాట్లాడారు. కేంద్రం చేసిన బూటకపు ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అయినందు వల్లే మావోయిస్టుల శవాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు భయపడుతున్నారని ఆరోపించారు. టెర్రరిస్టులను పట్టుకోవడంలో విఫలమయిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.. దేశ పౌరులైన మావోయిస్టులను చంపి సంబరాలు చేసుకుంటున్నదని అన్నారు. దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులతో చర్చలకు సిద్ధపడిన కేంద్రం ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరిపేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. టెర్రరిస్టులకంటే మోడీకి కమ్యూనిస్టులంటేనే భయమని తెలిపారు. కమ్యూనిస్టులను తుడిచి పారేస్తామని మోడీ, అమిత్ షా ప్రగల్భాలు పలుకుతున్నారని, అలాంటి వారందరికి హిట్లర్, ముస్సోలిని గతే పడుతుందని హెచ్చరించారు. దేశంలో అన్ని ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలని కోరారు. రాష్ట్రంలో బిజెపితో జత కట్టేందుకు బిఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నదని, అది కెసిఆర్‌కు కవిత రాసిన లేఖతో స్పష్టమయిందని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిస్టులను బతికించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని తెలిపారు. ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగయ్యాయని, ప్రజాప్రయోజనాలకే నిలబడి ఉండటం వల్లనే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేండ్ల పాటు నిలబడిందని అన్నారు. సిపిఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి వందేండ్లు అవుతుందని, ఈ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రసంగించారు. తొలుత జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి ఎగురవేశారు.

ఐజిసిఎస్ఇ పరీక్షల్లో ఫ్యూచర్ పాత్‌వేస్ విద్యార్థుల రికార్డ్

హైదరాబాద్ : ఐజిసిఎస్ఇ పరీక్షల్లో తమ విద్యార్థులు రికార్డ్ సృష్టించారని శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ గ్లోబల్ స్కూల్ వెల్లడించింది. మూడు నుంచి 8వ తరగతి వరకు 24 మంది విద్యార్థులు 10వ తరగతి ఐజిసిఎస్ఇ పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసి కొత్త ప్రమాణాలు స్థాపించి చరిత్ర సృష్టించారని పేర్కొంది. 100 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపింది. అద్భుత విజయం సాధించిన తమ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శ్రీచైతన్య ఫీచర్ పాత్‌వేస్ డైరెక్టర్ సీమా బొప్పన, చీఫ్ ఆఫ్ అకడమిక్స్ పుష్పవల్లి, ఎజిఎం శివరామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

జికెబి ఆప్టికల్స్‌లో రెబాన్ మెటా ఎఐ గ్లాసెస్



హైదరాబాద్ : జికెబి ఆప్టికల్స్ అన్ని షోరూంల్లో ఇకపై రేబాన్ మెటా ఎఐ గ్లాసెస్ లభిస్తాయని ఆ సంస్థ పేర్కొంది. రే-బాన్, మెటా సంస్థలు కలిసి రూపొందించిన ఈ కళ్లజోడుతో వినియోగదారులు ఫోటోలు, వీడియోలను సులభంగా తీయడంతో పాటుగా సంగీతం వినగలరు, కాల్స్ చేసుకోవడానికి వీలుందని జికెబి ఆప్టికల్స్ డైరెక్టర్ ప్రియాంక గుప్తా పేర్కొన్నారు. వీటి ధర రూ.29,900 నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ఫార్మా పేరుతో అల్ఫాజోలం దందా

- మూడు కోట్ల విలువైన అల్ప్రాజోలం పట్టివేత
- నిజామాబాద్ సిపి సాయి చైతన్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి సాయిచైతన్య

మహారాష్ట్ర కేంద్రంగా సాగుతున్న నిషేధిత మత్తు పదార్థాల తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఫార్మా కంపెనీ కేంద్రంగా అక్రమంగా అల్ప్రాజోలంను ఉత్పత్తి చేస్తున్న ముఠా గుట్టురట్టు చేసినట్టు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కమిషనరేట్‌లోని కార్యాలయంలో సీపీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నార్కోటిక్ డ్రగ్ బృందం ఇంటర్న్‌షిప్ ద్వారా బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఆధ్వర్యంలో అల్ప్రాజోలం కేసు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని సతారాలో సూర్యప్రభ ఫార్మాకెన్ ఇండస్ట్రీలో నిషేధిత మత్తు పదార్థాలు తయారీ అవుతున్నట్టు గుర్తించారు. ఇండస్ట్రీ నడుపుతున్న అమర్ సింగ్ దేశ్ముఖ్, ప్రసాద్ కడేరీ, బయో సిమ్యులెంట్ కంపెనీ యజమాని బాబురావు, అల్ప్రాజోలం కొనుగోలు చేసిన లక్ష్మణ్ గౌడ్, రాశి ట్రేడర్స్ ఫార్మా కంపెనీ విశ్వనాథ్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులు తెలంగాణలోని కల్లు డిపోలకు అక్రమంగా అల్ప్రాజోలం రవాణా చేస్తున్నట్టు గుర్తించామని వెల్లడించారు. లక్ష్మణ్‌గౌడ్ ఇచ్చిన సమాచారంతో నిందితులు బోధన్ గ్రామీణ పరిధిలోని సాలూరు గ్రామంలో లక్ష్మణ్‌గౌడ్‌కు 2.5 కిలోల ఆల్ప్రాజోలం డెలివరీ చేసే సమయంలో పోలీసులు అరెస్టు చేశారు. తదుపరి దర్యాప్తు కోసం నిందితులను కస్టడీకి తీసుకుంటామని చెప్పారు. సుమారు రూ.మూడు కోట్ల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని ఉమేర్గా నుంచి సోలాపూర్ వెళ్లే జాతీయ రోడ్డుపై నిందితుల్లో ఒకడైన బాబురావు నుంచి రూ.మూడు కోట్ల విలువ చేసే 30 కిలోల అల్ప్రాజోలం సీజ్ చేశారు. అలాగే సతారాలోని అమర్ సింగ్ దేశ్ముఖ్ నివాసంలో రూ.12 లక్షల నగదు, రూ. నాలుగు కోట్ల విలువ చేసే సూర్యప్రభ ఫార్మా కంపెనీని సీజ్ చేశారు. అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన సరస్వతి పుష్కరాలు

- 23.1 లక్షల మంది సందర్శన

హైదరాబాద్ బ్యూరో : సరస్వతి పుష్కరాలు విజయవంతంగా ముగిసినట్టు దేవాదాయ శాఖ మంగళవారం ప్రకటించింది. 12 రోజుల పాటు సాగిన పుష్కరాల్లో 23.1 లక్షల మంది సందర్శించినట్టు వెల్లడించింది. మొత్తం 47 వేల మంది యాత్రికులు హారతి కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపింది. పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం దేవాలయంలో 2,68,139 లడ్డూలు అమ్ముడైనట్టు తెలిపింది. పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల్లో 80,148 మంది సేవలు పొందినట్టు పేర్కొంది. ఆర్‌టిసి సంస్థ పుష్కరాల కోసం 90 బస్సులను తిప్పినట్టు వెల్లడించింది. పుష్కరాల్లో 1600 మంది భద్రతా సిబ్బంది, 950 మంది శానిటేషన్ సిబ్బంది, 33 మంది ఎన్‌డీఆర్ఎఫ్, 66 మంది ఎస్‌డిఆర్ఎఫ్, 35 మంది సింగరేణి రెస్క్యూటీమ్ సభ్యులు, వంద మంది గజ ఈతగాళ్లు తమ సేవలు అందించినట్టుతెలిపింది. పుష్కరాలకు అధికారికంగా 1,37,440 వాహనాలు వచ్చినట్టు పేర్కొంది.

కెయును మరింత బలోపేతం చేద్దాం

- జులై 7న 23వ స్నాతకోత్సవం
- కెయు విసి కె.ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐక్యతతో కాకతీయ యూనివర్సిటీని మరింత బలోపేతం చేద్దామని విసి కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లాలోని కెయు(కాకతీయ విశ్వవిద్యాలయం) సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రంతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోనే అన్ని యూనివర్సిటీల కంటే ముందుగా డిగ్రీ, పీజీ పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ప్రాంగణ నియామకాలు చేపట్టామని అన్నారు. యూనివర్సిటీ బడ్జెట్‌ను ముఖ్యమంత్రి సహకారంతో రూ.98 కోట్ల నుంచి రూ.144 కోట్లకు పెంచినట్టు తెలిపారు. అలాగే రూ.50 కోట్లు అభివృద్ధి గ్రాంట్ కూడా బడ్జెట్‌లో పొందిపర్చినట్టు చెప్పారు. దీనిని పూర్తిగా మౌలిక వసతులకు, అకాడమిక్ నిర్వహణకు ఖర్చు చేస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో కే హబ్ నిర్వహణ తీసుకొస్తామని అన్నారు. ఐదు రీసెర్చ్ సెంటర్లు, వ్యక్తిగత ప్రాజెక్ట్స్, 65 మంది ప్రాజెక్ట్ ఫెల్లోషిప్‌లకు అవకాశం వచ్చిందన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీలో స్కిల్స్ ఆధారిత కోర్స్‌లను ప్రారంభిస్తామని తెలిపారు. జీవ నైపుణ్యాలు, భాషా నైపుణ్యాలు పెంచే దిశగా సెల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆగస్టు 19వ తేదీ నుంచి నిర్వహించనున్న విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ సందర్భంగా మూడు రోజుల తెలంగాణా సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామని అన్నారు. దీనికి గుర్తుగా స్వర్ణోత్సవ అకాడమిక్ బిల్డింగ్‌ను, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ శతాబ్దిలోనికి అడుగుపెడుతున్న సందర్భంగా సెంటినరీ బిల్డింగ్, అకాడమిక్ బ్లాక్ స్థాపనకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు అందించినట్టు తెలిపారు. మహిళా ఇంజనీరింగ్ కాలేజీ అకాడమిక్ బ్లాక్, హాస్టల్, కామన్ మెస్, ట్రైబల్ విద్యార్థుల కోసం ఒకటి బాలుర, ఒకటి బాలికల వసతి గృహాల కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సంబంధిత అధికారుల నుంచి వచ్చిన నివేదికల స్వీకరణ అనంతరం, పాలక మండలి నిర్ణయం మేరకు ప్రహరీ చేపడుతామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి కోసం న్యాస్కం(నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్-నస్కమ్), ఐట్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. పివి విజ్ఞాన పీఠంను ప్రారంభించి సామాజిక, ఆర్థిక పురోగతి పరిశోధనల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఒక మేల్ మెడికల్ ఆఫీసర్, ఒక ఫిమేల్ మెడికల్ ఆఫీసర్‌ను, విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో నియమించినట్టు చెప్పారు. జులై 7న 23వ స్నాతకోత్సవ నిర్వహణకు రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. 573 గోల్డ్‌మెడల్స్, 546 పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయనున్నారని తెలిపారు. హైదరాబాద్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సంచాలకులు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు చెప్పారు.

3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- 150 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 13 వరకు జరుగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 26,286 మంది అబ్బాయిలు, 16,546 మంది అమ్మాయిలు కలిపి మొత్తం 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. హాల్‌టికెట్లను ఇప్పటికే సంబంధిత పాఠశాలలకు పంపించామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ లోనూ అందుబాటులో ఉంటాయనీ తెలిపారు.

కీర్తిలాల్‌లో పిల్లల కోసం 'లిల్ డాజిల్'

ప్రజాశక్తి - హైదరాబాద్



ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ కీర్తిలాల్ పిల్లల కోసం ప్రత్యేకంగా 'లిల్ డాజిల్'ను ఆవిష్క రించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ తెలిపారు. ఇందులో సరికొత్త చెవి పోగుల అభరణాల శ్రేణీ ఉత్పత్తులు లభిస్తాయన్నారు. జూబ్లీహిల్స్‌లోని గ్లో బై కీర్తిలాల్స్ షోరూంలో లేదా తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. లీల్ డాజిల్ కలెక్షన్ ధరలు రూ.20,000 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

నాణ్యతకు హెచ్‌కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ ప్రాధాన్యత

- డైరెక్టర్లు కార్తీక్, హర్షిత అజ్మీరా వెల్లడి

హైదరాబాద్ : రోగుల భద్రతతో పాటు నాణ్యతకు హెచ్‌కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ అండ్ హాస్పిటల్ ప్రాధాన్యత ఇస్తుందని హెచ్‌కె ఫార్మా అండ్ కాస్మోటిక్స్ ప్రయివేటు లిమిటెడ్ డైరెక్టర్లు కార్తీక్ పూత, హర్షిత అజ్మీరా నాయక్ తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన మీడియాతో వారు మాట్లాడుతూ.. నిజాయితీగా వ్యవహరిస్తున్న తమ సంస్థపై ఇటీవల కొంత మంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. చర్మ సంబంధిత సమస్యల పరిష్కారానికి అత్యుత్తమ సేవలను అందిస్తున్నామన్నారు. తెలంగాణలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ ఆంధ్రప్రదేశ్, కర్ణాటకకు తమ సేవలను విస్తరించామన్నారు.

డ్రగ్ లైసెన్స్ లేకుండా వెటర్నరీ మందుల అమ్మకం

- డిసిఎ దాడుల్లో పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్ లైసెన్స్ లేకుండా అమ్ముతున్న వెటర్నరీ మందులను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... వరంగల్ జిల్లా గిర్మాజీపేట్‌లోని ఓల్డ్ గ్రెయిన్ మార్కెట్ ఏరియాలో సాయికిరణ్ పౌల్ట్రీ అండ్ వెట్ మెడికల్స్‌పై దాడి చేసి రూ.2.5 లక్షల విలువైన మందులను నిల్వ ఉంచినట్టు గుర్తించారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అన్ని రకాల ఫ్లూ, జ్వరాలకు సహాయపడుతుందంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలతో అమ్ముతున్న ప్లాటొకొర్-టోటల్ సిరప్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని ఒక మెడికల్ స్టోర్‌లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని హర్యానాలోని ఆల్ట్రా గ్రీన్ యూనిట్ -1 తయారు చేస్తుండగా, హిమాచల్‌ప్రదేశ్‌లోని బయోకోర్ ఫార్మాస్యూటికల్స్ మార్కెటింగ్ చేస్తున్నది. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలపై 29న మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల కమిటీ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశాన్ని నిర్వహించారు. సిసిఎల్‌ఎ, రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. ఇటీవల ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమై వారి సమస్యలపై విజ్ఞాపనలు స్వీకరించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అధికారులు వివరించారు. ఈనెల 29న మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహిస్తామనీ, అందులో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని వివరించాలంటూ అధికారుల కమిటీకి డిప్యూటీ సీఎం సూచించారు.

రూ.15 లక్షలకే మీ ఎకరం భూమిస్తవా?

- నిమ్జ్ భూ బాధితులకు మార్కెట్ ధరపై మూడింతలు అదనంగా ఇవ్వాలి
- లేదంటే భూముల్లో ఎవర్నీ అడుగుపెట్టనీయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఎవడబ్బ జాగీరని పేదల భూముల్ని తక్కువ పరిహారమిచ్చి అప్పనంగా లాక్కుంటున్నరు.. సిఎం రేవంత్‌రెడ్డికి ఉన్న భూముల్ని.. మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్ భూముల్నీ.. కేవలం రూ.15 లక్షలకే ఎకరం చొప్పున అమ్మగలరా' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. జహీరాబాద్ నిమ్జ్ రైతులకు 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరపై మూడింతలు అదనంగా నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ప్రతి ఎకరానికి 120 గజాల ప్లాట్‌ను ఇవ్వాలని, లేని పక్షంలో పారిశ్రామిక వేత్తలనే కాదు స్వయంగా సిఎం రేవంత్‌రెడ్డి వచ్చినా నిమ్జ్ భూముల్లో అడుగుపెట్టనియ్యమని హెచ్చరించారు. జహీరాబాద్ పరిధిలో నిమ్జ్ ప్రాజెక్టు పేరిట వేలాది ఎకరాల భూముల్ని కోల్పోయిన బాధితులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నానుద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.50 లక్షలకు పైనే పలుకుతుందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్జ్ కోసం తీసుకుంటున్న భూములకు ఎకరానికి కేవలం రూ.15 లక్షల పరిహారమే ఇస్తుందన్నారు. పేదల రైతుల భూముల్ని తక్కువ పరిహారంతోనే లాక్కోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజా పాలన జపం చేస్తున్న రేవంత్‌రెడ్డి ఇటీవల జహీరాబాద్ ప్రాంతంలో పర్యటనకొచ్చి వేలాది ఎకరాల భూముల్ని కోల్పోతున్న రైతుల గురించి కనీస ప్రస్తావన చేయకపోవడం దారుణమన్నారు. పైగా ప్రజలు, రైతుల కోసం పోరాడుతున్న సిపిఎం నాయకుల్ని అరెస్టు చేసి నిర్బంధించారని, ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రం, దేశంలో పరిపాలన చేసిన బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ వంటి పార్టీలన్నీ ధనవంతులు, కార్పొరేట్లు, దోపిడీ శక్తుల కోసం పని చేయడం తప్ప పేదల గురించి పట్టించుకున్న చరిత్ర లేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరపై మూడింతల నష్టపరిహారం చెల్లించాలన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఎకరం ధర రూ.50 లక్షలున్నందున నిమ్జ్ కోసం సేకరిస్తున్న భూములకు ఎకరానికి కోటిన్నర పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు ప్రతి ఎకరానికి 120 గజాల ప్లాట్ కూడా ఇవ్వాలన్నారు. రైతులతో పాటు భూముల్లేని వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు సైతం ఉపాధిని కోల్పోతున్నందున వారందరికి కూడా పునరావాసం కల్పించాలని కోరారు. వీటిని పరిష్కరించకుండా భూముల్లోకి పారిశ్రామికవేత్తలనే కాదు స్వయాన సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినా అడుగుపెట్టనీయమని హెచ్చరించారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

2013 చట్టాన్ని అమలు చేయాలి:ఆర్.వెంకట్రాములు

భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. నిమ్జ్ భూ బాధితులకు అప్పటి కెసిఆర్, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఇద్దరు కూడా న్యాయమైన పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని అన్నారు. లగచర్లలో ఇంటి స్థలాలివ్వడంతో పాటు నష్టపరిహారం ఇస్తున్న రేవంత్‌రెడ్డి జహీరాబాద్ నిమ్జ్ బాధితులకు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. త్వరలోనే సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిమ్జ్ రైతుల సమస్యలను చర్చిస్తామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. నిమ్జ్ రైతులకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే పద్ధతిలో రైతులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏఓకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, అతిమేల మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.యాదగిరి, మహిపాల్, నాగేశ్వర్‌రావు, నిమ్జ్ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే

- పార్లమెంటు సమావేశం ఎందుకు ఏర్పాటు చేయరు?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కేంద్రంలోని బిజెపి పాలకులు బలహీనపరిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం పెట్టుబడిదారులు, ఆక్రమణదారులతో నిండిపోయిందని, వారికి అనుకూలమైన చట్టాలు చేస్తూ, పార్లమెంట్ వ్యవస్థ మొత్తం వాళ్లకే ఉపయోగపడుతోందని అన్నారు. న్యాయవ్యవస్థ సైతం పట్టాలు తప్పిందని, మీడియా మొత్తం కార్పొరేటర్ శక్తుల చేతుల్లో బందీ అయిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి కావాల్సిన నాలుగు పిల్లర్లు గాడి తప్పి పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రజలే చైతన్యవంతులై రాజ్యాంగాన్ని, అన్ని సంస్థలనూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజల దృష్టి మళ్లించడానికి మత విద్వేషాలు రెచ్చగొడుతూ ఒకే భాష, ఒకే దేశం, ఒకే మతం, ఒకే ఎన్నిక అంటూ ముందుకు తీసుకొచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యం మాత్రమే అన్నారు. పర్యాటక కేంద్రాల వద్ద భద్రత ఎందుకు లేరని ప్రశ్నించారు. మావోయిస్టులు కాల్పులు విరమించి ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని చెబుతున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా మావోయిస్టులను చంపేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ వస్తోందని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండు నాయక్, పల్లె వెంకటరెడ్డి, ఎస్‌కే యాకూబ్, వట్టెపు సైదులు, దుగ్గి బ్రహ్మం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను తదితరులు ఉన్నారు.

ఉస్మానియాలో అన్ని వేళల్లో సహాయక సేవలు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో రోగుల కోసం 24/7 ప్రత్యేక హెల్ప్‌లైన్, రోగి సహాయక సేవలను హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేష్ సహాయ్ సమక్షంలో బిఎస్‌బి హ్యూమన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రతినిధి సల్మాన్ బాబు ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సేవలతో రోగులకు తక్షణ సహాయం, మార్గనిర్దేశం అందుతుందన్నారు. మా లక్ష్యం ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడమన్నారు. ఆ దిశగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వీరు వాహన సౌలభ్యం (వీల్ చెయిర్లు, స్ట్రెచర్లు) ఇవ్వడమే కాకుండా.. వివిధ విభాగాలకు రోగులను నడిపించడం, ఓపీ సేవల్లో సహకరించడం, గుర్తు తెలియని, అనాథ రోగులకు వైద్యం అందించడంలో కీలకంగా పని చేస్తారని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేష్ సహాయ్ పేర్కొన్నారు.

సామాజిక ఉద్యమంలా వన మహోత్సవం

- పండ్లు, పూల, ఔషధ మొక్కలకు ప్రాధాన్యమివ్వండి
- అధికారులతో సమీక్షలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ ఏడాది వనమహోత్సవాన్ని ఒక సామాజిక ఉద్యమంలా చేపట్టాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వనమహోత్సవ ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. అందులో అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ, ఎంఎయుడి కార్యదర్శి టీ కే.శ్రీదేవి, ప్రియాంక వర్గీస్, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటవీ, ఇతర శాఖ అధికారుల ఆధ్వర్యంలో జూన్ మొదటి వారం నుంచి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్న లక్ష్యంతో అధికారులు సిద్ధం చేసిన పిపిటిని మంత్రి సురేఖ వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..గతేడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024లో 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా... 19.04 కోట్లు నాటినట్టు గుర్తు చేశారు. 95 శాతం మేరకు అంచనాలను అందుకున్నామని వెల్లడించారు. ఈ సారి 100 శాతం లక్ష్యం పూర్తికావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి ప్రతి ఇంట్లోనూ వాటిని ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో పూల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలను ఎక్కువగా నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలన్నారు. వనజీవి రామయ్య వంటి మహనీయుల కుటుంబీకులను సన్మానించాలని సూచించారు.



సినీ రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్ ముద్ర శాశ్వతం

- సాహితీవేత్త నరసింహారెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

పౌరాణిక చిత్రాల్లో రావణాసురుడు, దుర్యోధనుడు వంటి ప్రతి కథానాయకుడు పాత్రలు ధరించి ప్రజలను మెప్పించినా రాజకీయాల్లోకి వచ్చి తొమ్మిది నెలల కాలంలోనే పార్టీ పెట్టి అధికారం సాధించినా అది కేవలం నందమూరి తారక రామారావుకు మాత్రమే సాధ్యమైందని ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. సినీ రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్ ముద్ర శాశ్వతం అని ఆయన చెప్పారు. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై శతాబ్ది పూర్వ మహనీయులు కార్యక్రమ పరంపరలో భాగంగా డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు భాష తెలుగు జాతికి జాతీయ స్థాయిలో గుర్తింపుకు ఎన్‌టిఆర్ కారణమన్నారు. అయన ప్రవేశ పెట్టిన పేదలకు రూపాయికే కిలో బియ్యం,చేనేత వస్త్రాలు పంపిణీ వంటి సంక్షేమ పథకాలు తదుపరి వచ్చిన పాలకులకు మార్గదర్శనం చేశాయని వివరించారు. ప్రజలకు పాలన చేరువ కావలనే సదుద్దేశంతో మండల వ్యవస్థను ఆరంభించిన ఎన్‌టిఆర్ ఉత్తమ ప్రజా పాలకుడు అని కొనియాడారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో తెలుగు దేశం నాయకుడు నైషధం సత్యనారాయణ, కళా పోషకుడు వెంకట రెడ్డి, గాయని అన్నపూర్ణ,మల్లాది ఉష పాల్గొన్నారు.

2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

- రూ.లక్షలోపు యూనిట్లకు తొలి ప్రాధాన్యం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ రెండో తేదీన రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నట్టు నిరుద్యోగులకు మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) తీపి కబురు అందించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష రూపాయల లోపు ఉన్న యూనిట్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే..మరో వైపు స్వయం ఉపాది అవకాశాలను పెంపొందిస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తుందనీ, బడుగు, బలహీన వర్గాల్లో, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కగార్ ఆపాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని కోరారు. వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు ఉంటాయనీ, వ్యక్తులను నిర్మూలించడం ద్వారా ఆలోచనలను నిర్మూలించలేరని హితవు పలికారు. మావోయిస్టుల కారణంగా అభివృద్ధి ఆగిందనే వాదనంలో వాస్తవం లేదనీ, 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టులున్నారనీ, అంతకు ముందు మూడు దశాబ్దాలు ఎందుకు అభివృద్ధి జరగలేదని ప్రశ్నించారు. దేశంలో ఆరు రాష్ట్రాల్లోనే మావోయిస్టుల ప్రభావం ఉందని కేంద్రం చెబుతున్నదనీ, అయితే మిగిలిన రాష్ట్రాల్లో ఎందుకు అభివృద్ధి జరగడం లేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలనలో ప్రజల అవసరాలు తీర్చడం ద్వారా రాష్ట్రంలో నక్సలిజం విస్తరించలేదనీ, దేశవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని సూచించారు. ప్రజలకు మేలు చేయని మోడీ విధానాలపైన మావోయిస్టులే కాదు...ప్రజలు ప్రశ్నిస్తున్నారని సింగిరెడ్డి గుర్తుచేశారు. ఆధునిక యుగంలో నియంత పోకడలకు తావు లేదని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా సాయుధ పోరాటాలు విజయవంతమైన చరిత్ర లేదనీ, మావోయిస్టులు ఆలోచించి ముందుకు రావాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.


ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆందోళనలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లకిచ్చిన హామీలను అమలు చేయాలి

- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద 'ఆటో ఆకలి కేకలు' మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద 'ఆటో ఆకలి కేకలు' పేరుతో మహాసభ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో జెఎసి చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని, సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం వల్ల నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ప్రతి ఆటోడ్రైవర్ కుటుంబానికీ రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించి కుటుంబంలో ఒక్కరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని ఆటో డ్రైవర్లకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 7.5 లక్షలకు పైచిలుకు ఆటో డ్రైవర్లు ఉన్నారని, కుటుంబ సభ్యులతో కలిపి 30 లక్షలకు పైగా ఓటు బ్యాంకు కలిగి ఉన్నామన్నారు. తమను వాడుకుంటున్నారుగానీ ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రంగాన్ని కాపాడుకోవాలంటే ఏకైక మార్గం పోరాటం చేయడమేనన్నారు. 32 రోజులుగా ఆటో రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించి సభలు, సమావేశాలు పెట్టి విజయవంతం చేశామని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో ఆటోరంగం పూర్తిస్థాయిలో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన దాని ప్రకారం ప్రతి ఆటో కార్మికునికీ రూ.12 వేలు నెల నెలా అందజేయాలని కోరారు. ప్రయివేటు ఫైనాన్స్ ఆగడాలను అరికట్టి వడ్డీ స్లాబ్ సిస్టం తొలగించాలని, బ్యాంకుల సిస్టం అమలు చేసి ఫైనాన్స్ పేపర్లు తెలుగు భాషలో ఉంచాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటోలకు స్టేట్ పర్మిట్ ఇవ్వాలన్నారు. ఆటో కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎండీ హబీబ్, వేముల మారయ్య, బగుడాల సాయిలు, ఎంఎ సలీం, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జాతాలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రభుత్వ బడులు నిలబడాలి

- చదువుల్లో అంతరాలు పోవాలి
- పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ బడులలో అంతరాలు లేని విద్య రావాలని, ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌరస్ స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తరగతికి ఒక గది.. ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువుల్లో అంతరాలు పోవాలి.. ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించాలని కోరుతూ తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రానికి చేరుకుంది. అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బడి ఇడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలన్నింటినీ రీఆర్గనైజ్ చేయాలన్నారు. ఇతర ఆవాస్ నుంచి బడికి రావాల్సిన విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో విద్యకు పది శాతం కేటాయించాలని, రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ఏర్పాటుకు కేంద్రం రూ.ఐదు వేల కోట్లు ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రమంగా అంతరాలు లేని బడులను అభివృద్ధి చేసి పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఒకే బడిలో.. ఒకే తరగతి గదిలో చదువుకునే పరిస్థితులు కల్పించారు. పౌర సమాజం మేల్కొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ జాతకు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.


ఆందోళన చేస్తున్న రైతులు

తరుగు లేకుండా ధాన్యం కొనాలని రైతుల ఆందోళన

- అధికారుల జోక్యంతో ఒప్పుకున్న మిల్లు యాజమాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం రాజీ పేట గ్రామానికి చెందిన రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుకు పంపగా.. తరుగు తీస్తేనే దిగుమతి చేసుకుంటామంటూ మిల్లు యజమాని స్పష్టంచేయడంతో రైతులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేకరించిన ధాన్యాన్ని ఐదు రోజుల క్రితం నార్సింగిలోని భాగ్యలక్ష్మి రైస్ మిల్లుకు తరలించారు. ధాన్యం తడిసిందని తరుగు ఇస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటానని రైస్ మిల్ యజమాని శ్రీనివాస్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో చెప్పడంతో వారు రైతులకు సమాచారం అందించారు. దాంతో రైతులు రైస్ మిల్‌కు చేరుకొని.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తరుగు లేకుండా తీసుకోవాలని రైస్ మిల్ యజమాని శ్రీనివాస్‌ను కోరారు. ధాన్యం తడిసినందున మొలకెత్తిందని, తరుగు తీయాల్సిందేనని మిల్లు యజమాని స్పష్టంచేశారు. అందుకు ఒప్పుకోని రైతులు.. తమకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ రైస్ మిల్ గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళన చేపట్టిన విషయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ దృష్టికి అధికారులు తీసుకుకెళ్లారు. స్పందించిన అదనపు కలెక్టర్ రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రైస్‌మిల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సివిల్ సప్లయ్ అధికారులు స్థానిక తహసీల్దార్ షేక్ కరీంకు విషయాన్ని తెలపగా.. ఆయన భాగ్యలక్ష్మి రైస్ మిల్లుకు చేరుకొని యాజమానితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు న్యాయం చేయాలని, తరుగు లేకుండా ధాన్యాన్ని సేకరించాలని యజమానిని ఆదేశించారు. దాంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆందోళన విరమించారు.